300 యూనిట్ల విద్యుత్ వాడకంపై ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

300 యూనిట్ల విద్యుత్ వాడకం నిబంధనపై పింఛను పొందుతున్న వృద్ధుల్లో తీవ్రఆందోళన నెలకొందని కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ఎండలకు తట్టుకోలేక చాలా మంది ఫ్యాన్లు, కూలర్లు, ఎసీలు వాడిన కారణంగా గత మూడు నెలలుగా విద్యుత్ వాడకం పెరిగి 300 యూనిట్లు పైగా బిల్లులు వచ్చాయని, ఆ కారణంగా పింఛను పోతుందేమోనని భయాందోళన వృద్ధుల్లో నెలకొందని పేర్కొన్నారు. జూన్ 29 వచ్చినా ఎండలు తగ్గని కారణంగా 300 యూనిట్ల వాడకం నిబంధన సడలించాలని, లేదా నిబంధనను 500 యూనిట్లకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వృద్ధాప్యంలో మానసిక ఆందోళనకు గురవుతున్న వారిపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన కోరారు.

సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

హాజరైన నిర్వాసితులు, నాయకులు, పేదలు

'పోరుకేక'లో మేముసైతం

సాగుతున్న పోరుకేక పాదయాత్ర

పాదయాత్రకు రాజకీయ, ప్రజాసంఘాల మద్దతు వెల్లువ

తరలొచ్చిన టిడిపి, జనసేన పోలవరం నియోజకవర్గ నేతలు

పదోరోజు కరుటూరు కాలనీ నుంచి బుట్టాయగూడెం వరకు సాగిన యాత్ర

రెడ్డి గణపవరంలో 200 కిలోమీటర్లు దాటిన 'పోలవరం పోరుకేక'

బుట్టాయగూడెంలో మహాపాదయాత్రలో కలిసిన ఉపయాత్ర

పలుచోట్ల బహిరంగ సభల్లో ప్రభుత్వాల తీరుపై మండిపడ్డ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా కొనసాగుతున్న 'పోలవరం పోరుకేక' యాత్రకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు వెల్లువెత్తుతోంది. విజయవాడ, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, కాకినాడ వంటి దూరప్రాంతాల నుంచి సైతం ప్రజాసంఘాల నాయకులు తరలొచ్చి పాదయాత్రలో పాల్గొంటున్నారు. గురువారం జీలుగుమిల్లి మండలం కరుటూరు కాలనీలో ప్రారంభమైన యాత్ర ములగలంపల్లి, రౌతుగూడెం, రెడ్డిగణపవరం, పాలకుంటకాలనీ, రామారావుపేట, బుట్టాయగూడెం వరకు 17 కిలోమీటర్ల మేర సాగింది. పలుచోట్ల బహిరంగ సభలు జరగ్గా టిడిపి, జనసేన నాయకులు యాత్రకు సంఘీభావంగా కదలొచ్చారు. ములగలంపల్లి సభలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ మద్దతు ప్రకటిస్తూ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడారు. బుట్లాయగూడెంలో జరిగిన సభలో జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు తమ పార్టీ తరపున మద్దతు ప్రకటించడంతో పాటు నిర్వాసితుల పట్ల వైసిపి వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించారు. ఈ నెల 20న నెల్లిపాకలో ప్రారంభమైన పాదయాత్ర పదోరోజు గురువారం రెడ్డిగణపవరం చేరేసరికి 200 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. దీంతో పెద్దఎత్తున గ్రామాల జనం కదిలివచ్చి హారతులు పట్టి స్వాగతించారు. ఈ పాదయాత్రకు ఆశావర్కర్ యూనియన్‌తో పాటు ఐద్వా, గిరిజన సంఘాలు, విశాఖ స్టీల్‌ప్లాంటు యూనియన్ నాయకులు, పశ్చిమగోదావరి సిపిఎం శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు.

పూలతో స్వాగతం పలుకుతున్న నేతలు

కళాకారుల ప్రదర్శనలు

ఆయుధ కర్మాగారంతో దెబ్బతీయాలని చూస్తున్నారు

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగారం ఏర్పాటు ద్వారా రెండు పంచాయతీలను ఖాళీ చేయించాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. అదానీ, అంబానీల కోసం ప్రజలను బలి చేయాలని చూస్తున్నారన్నారు. పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తునందన్నారు. ఈ గ్రామాలకు వచ్చిన నిర్వాసితులకు, స్థానికుల మధ్య గొడవలు పెడుతుందన్నారు. జల్లేరు ప్రాజెక్టు పేరులో మరికొన్ని గ్రామాలను ముంచాలని చూస్తుందన్నారు. అంతా నిర్వాసితులకు అండగా ఉండాలని, కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, విఆర్‌పురం ఎంపిపి కారం లక్ష్మి, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్నకుమార్, సిపిఎం జిల్లా నేతలు మొడియం నాగమణి, పి.మంగరాజు, కె.శ్రీనివాస్, వెంకట్రావు, ముత్యాలమ్మ, బుల్లమ్మ, అందుగుల ఫ్రాన్సిస్, ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్ పాల్గొనగా సభలకు మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు.

అసమర్థ ప్రభుత్వం ఇది

చిర్రి బాలరాజు, జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి

పోలవరం నిర్వాసితుల సమస్యలను వైసిపి అటకెక్కించిందని చిర్రి బాలరాజు విమర్శించారు. ఏ ఒక్కరికీ న్యాయం చేయలేదన్నారు. పునరావాసం ప్యాకేజీ రూ.10 లక్షలు, భూమికి రూ.5 లక్షలు హామీ కూడా నెరవేర్చలేదన్నారు. నిర్వాసితులను గోదావరిలో ముంచేస్తున్నారన్నారు. స్థానిక ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అసెంబ్లీలో ఒక్కసారి కూడా నిర్వాసితుల గురించి మాట్లాడలేదన్నారు. సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేక యాత్ర తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటు రానున్న రోజుల్లో మరింత సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

బుట్టాయగూడెంలో కలిసిన పోలవరం ఉపయాత్ర

పోలవరం నుంచి 28వ తేదీన ప్రారంభమైన పోలవరం ఉపయాత్ర గురువారం సాయంత్రానికి బుట్టాయగూడెం చేరుకుని ప్రధాన పోరుయాత్రతో కలిసింది. దీంతో బుట్టాయగూడెం కేంద్రం ఎర్ర రంగు పులుముకున్న మాదిరిగా ఎర్రజెండాలతో రెపరెపలాడింది. ప్రజానాట్యమండలి బృందం చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రెడ్డి గణపవరంలో జనసేన స్వాగతం

బుట్టాయగూడెం మండలంలోని రెడ్డి గణపవరం చేరుకున్న పాదయాత్రకు జనసేన మండల అధ్యక్షులు తెల్లం రవిప్రకాష్, గురజాల వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, వెంకటవరప్రసాద్, సురేష్‌బాబు, కూనం రాజా, తెల్లం పున్నయ్య, ముత్యాలరావు, జోగిరాజు, సురేష్ తదితరులు పెద్దఎత్తున స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

పశ్చిమగోదావరి నుంచి తరలొచ్చిన నేతలు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కరమే ప్రధాన ఎజెండాగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో సాగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్రకు పెద్దఎత్తున సంఘీభావం వెల్లువెత్తుతుంది. పదోరోజు గురువారం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది పాదయాత్రకు సంఘీభావంగా తరలివచ్చారు. జిల్లా నాయకుల ముందు ఇప్పటికే పశ్చిమగోదావరి సిపిఎం జిల్లా కార్యదర్శి పాదయాత్రలో మమేకమై నడుస్తుండగా జిల్లా నాయకులు జి.గోపాలన్, కె.పెద్దిరాజు, డి.వాసుదేవరరావు, పివి.ప్రతాప్, ఎ.అజయ్‌కుమారి, పి.పూర్ణ, బి.జార్జి, కె.బాలరాజు, ఎం.త్రిమూర్తులు, ఎం.వైకుంఠరావు, జయప్రద, ఎం.రామాంజనేయులు, జవ్వాది శ్రీనివాస్, మల్లిపూడి ఆంజనేయులు, కెవిపిఎస్ నాయకులు క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు పెద్దిరాజు, పి.వాసు మరికొందరు పాదయాత్రకు సంఘీభావంగా తరలివచ్చారు.

200 కిలోమీటర్ల మైలు రాయి దాటిన పాదయాత్ర

పోలవరం సమస్యలే పరిష్కరంగా ప్రధాన ఎజెండాగా సాగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్ర గురువారం 200 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. నెల్లిపాక నుంచి ఈ నెల పదో తేదీన ప్రారంభమైన పోలవరం పోరుకేక యాత్ర గురువారంతో పదో రోజుకు చేరుకుంది. బుట్టాయగూడెం మండలం రెడ్డి గణపవరంలో 200 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకోవడంతో స్థానిక గిరిజనులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. 200 కిలోమీటర్లు అక్షరాలతో ఆర్అండ్‌బి రహదారిపై అంకెలు వేసి స్వాగతం పలికారు. పాదయాత్ర బృందానికి హారతులిచ్చి బొట్టు పెట్టి అంతా అభినందనలు తెలిపారు.

విశాఖపట్నం సిఐటియు నాయకుల మద్దతు

పోలవరం పోరుకేక పాదయాత్రకు విశాఖపట్నం నుంచి సిఐటియుకు చెందిన గిరిజన ఉద్యోగుల సంఘం, గిరిజన సంఘం నాయకులు సంఘీభావంగా తరలివచ్చారు. వీరిలో ఆర్.సత్యారావు, బి.తౌడన్న, గౌరిశంకర్, కోటి, స్వామి, కెఎం.శ్రీనివాస్, కుమార్, జగన్ పలువురు ఉన్నారు.



పోరుకేక మహాపాదయాత్రలో కలిసిన ఉపయాత్ర

ప్రాజెక్టుకు, పునరావాసానికి

కేంద్రమే నిధులివ్వాలి

'పోలవరం పోరుకేక' ఉపయాత్రలో నేతలు

ప్రజాశక్తి - పోలవరం, బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నిర్వాసితుల పునరావాసానికి కేంద్ర ప్రభుత్వమే నిధులివ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' ఉపయాత్ర రెండో రోజు గురువారం ఉత్సాహంగా సాగింది. మండలంలోని కోండ్రుకోట పునరావాస కాలనీ నుండి ప్రారంభమైన యాత్ర ఎల్ఎన్‌డిపేట మీదుగా కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలంలోకి ప్రవేశించింది. కోండ్రుకోట పునరావాస గ్రామం, ఎల్ఎన్‌డి పేట గ్రామాల్లోని సెంటర్లలో సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అధ్యక్షతన సభలు జరిగాయి ఈ సభల్లో శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్వాసితులకు పునరావాసం కల్పించే చోటే 25 రకాల మౌలిక వసతులు కల్పించాలని 2013 భూ సేకరణ చట్టం చెబుతుందన్నారు. అయితే ఏ కాలనీలోనూ కనీస సౌకర్యాలు లేవన్నారు. కొండ్రుకోట పునరావాస గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడంతో గిరిజనులు చనిపోతే అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిర్వాసితులను అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పునరావాసానికి అయ్యే మొత్తం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు తామా ముత్యాలమ్మ మాట్లాడుతూ పునరావాస గ్రామాల్లో అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, రాజ్యాంగం ఐదవ షెడ్యూల్, 1/70 చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో యాత్రకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. నేతలు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పునరావాసానికి అయ్యే ఖర్చులో 20 శాతం నిధులు కూడా ఇవ్వలేదన్నారు. పైగా పునరావాసం తమకు సంబంధం లేదని మోడీ ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపికి, గతంలో అధికారంలో ఉన్న టిడిపికి ఎన్నికల్లో ఓట్లు అవసరం వచ్చినప్పుడు మాత్రమే నిర్వాసితులు గుర్తుకొస్తారన్నారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు ప్రకటించాలని కోరారు. బుట్టాయగూడెం మండలం కండ్రికగూడెం, నూతిరామన్నపాలెం, బొత్తప్పగూడెం, నందాపురం, కాపవరం, తూర్పు రేగులగుంట మీదుగా యాత్ర బుట్టాయిగూడెం చేరింది. ఆయా గ్రామాల్లో పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమాల్లో నేతలు బొరగం భూచంద్రరావు, మిడియం గంగాదేవి, ముచ్చిక చల్లాయమ్మ, మిడియం వెంకాయమ్మ, మిడియం పండు, మడివి చలపతి, తెల్లం వెంకటలక్ష్మి, సున్నం గంగమ్మ, మడకం సురమయ్య, తెల్లం వెంకటేశ్వర్లు, జలగం బులివెంకమ్మ, సవలం వీరమ్మ పాల్గొన్నారు.

నిర్వాసితుల పక్షాన నికరంగా పోరుడుతుంది సిపిఎంనే

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై నికరంగా పోరాడుతున్నది సిపిఎం ఒక్కటేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. పోలవరం పోరుకేక ఉపయాత్రలో బుట్టాయిగూడెం మండలం తూర్పురేగులగుంట వద్ద ఆయన పాల్గొని బుట్టాయిగూడెం వరకు నడిచారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పక్షాలుగా ఉన్న వైసిపి, టిడిపి, జనసేన కేంద్రంలోని బిజెపితో స్నేహం చేస్తూ నిర్వాసితుల సమస్యలపై పోరాడకుండా నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా నిర్వాసితుల సమస్యలపై జరుగుతున్న పోరాటాలకు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు.

కొరుటూరు నిర్వాసిత కాలనీవాసుల వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని కొరుటూరు నిర్వాసిత కాలనీవాసులు కోరారు. పోలవరం పోరుకేక మహా పాదయాత్రలో గురువారం కొరుటూరు నిర్వాసితులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు అందించారు. తమకు 80 ఎకరాలు భూమికి భూమి ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వాపోయారు. టేకూరు నిర్వాసిత యువతకు పరిహారం అందరికీ అందలేదని తెలిపారు. రూ.5.50 లక్షల పరిహారం అందక అనేక మంది నిర్వాసితులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. దీనిపై శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని తెలిపారు. జులై 4న మహాధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలి

కె.లచ్చిరెడ్డి, పల్లపూరు కాలనీ, రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం మండలం

ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలకు అందించే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను నిర్వాసిత కాలనీల్లో అమలు చేయాలి. మేం విద్యుత్ ఛార్జీలు యధావిధిగా కట్టాల్సి వస్తుంది. ప్రతినెలా రూ.400 వరకు కరెంట్ బిల్లు కట్టాల్సి రావడం చాలా ఇబ్బందిగా ఉంది.

రెండేళ్లుగా శ్మశాన వాటిక లేదు

సొంట్రు బాబూరావు, పల్లపూరు నిర్వాసిత కాలనీ, బుట్టాయగూడెం మండలం

మాది పోలవరం మండలం తూటికుంట పంచాయతీ పరిధిలోని పల్లపూరు గ్రామం. 2021 సెప్టెంబర్‌లో మా గ్రామం నుండి తీసుకువచ్చి ఈ కాలనీలో పెట్టారు. మొత్తం 51 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటివరకు శ్మశాన వాటిక లేదు. దీంతో ఎవరైనా చనిపోతే మరోచోట బతిమాలి దహన సంస్కారాలు నిర్వహించాల్సి వస్తోంది. అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదు.

పనికిరాని భూమి ఇచ్చారు

కొండ్ల లింగారెడ్డి, పల్లపూరు నిర్వాసిత కాలనీ, బుట్టాయగూడెం మండలం



నాకు 80 సెంట్లు భూమి ఉండేది. ఆ భూమిలో మొక్కజొన్న, బొబ్బర పంటలు పండించే వాడిని. పోలవరం మండలంలో పల్లపూరు గ్రామాన్ని బుట్టాయిగూడెం మండలం పల్లపూరు నిర్వాసిత కాలనీకి తరలించారు. రెడ్డిగణపవరంలో 80 సెంట్లు భూమికి భూమిగా ఇచ్చారు. ఆ భూమి సాగుకు పనికి రావడం లేదు. దీంతో సాగు భూమి లేకుండా పోయింది. రోజుకూలి పనులపై ఆధారపడి బతకాల్సి వస్తుంది.

పోడు భూములకు భూమికి భూమి ఇవ్వలేదు

పాములేటి గంగిరెడ్డి, పల్లపూరు నిర్వాసిత కాలనీ, బుట్టాయగూడెం మండలం

పోలవరం మండలంలోని మా సొంతూరు పల్లపూరులో 2.5 ఎకరాల భూమి ఉండేది. మమ్మల్ని పునరావాస కాలనీకి తరలించారు. ఇక్కడ భూమికి భూమి ఇవ్వలేదు. దీంతో కూలి నాలి చేసుకుని బతకాల్సి వస్తుంది. ఉపాధి పనే దిక్కయింది.

పాదయాత్రలో మాట్లాడుతున్న టిడిపి నేత బొరగం శ్రీనివాస్, సిపిఎం నేతలు వి.వెంకటేశ్వర్లు, ఎం.సీతారాం, మొడియం నాగమణి ఆశాల రాష్ట్ర నేత కె.ధనలక్ష్మి, జనసేన నేత చిర్రి బాలరాజు, అమరుల స్థూపం వద్ద నేతల నివాళి

ఉత్తేజభరితం.. ఉత్సాహపూరితం

ఆకట్టుకున్న ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు

జంగారెడ్డిగూడెం:'పోలవరం పోరుకేక' మహా పాదయాత్రకు ముందు, సభా ప్రాంగణాల్లో ప్రజా నాట్యమండలి కళారూపాల ప్రదర్శనలు ఆద్యంతం ఉత్తేజభరితంగా, ఉత్సాహపూరితంగా సాగుతూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు ఆధ్వర్యంలో 10 రోజులుగా మహా పాదయాత్రతో కళాకారులు ముందుకు సాగుతున్నారు. డప్పు వాయిద్యాలు ఉత్సాహం నింపుతుండగా ప్రభుత్వాల విధానాలు, సిపిఎం పోరాటాలపై ప్రదర్శిస్తున్న కళారూపాలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.

పాదయాత్రికులకు మజ్జిగ పంపిణీ

బుట్టాయగూడెం:నిర్వాసితుల సమస్యలపై చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహాపాదయాత్ర బుట్టాయగూడెం మండలంలో ప్రవేశించాక రెడ్డిగణపవరం వంతెన వద్ద పడమటి పాలగుంట గ్రామానికి చెందిన కారం చంద్రరావు, పెట్టి వీరయ్య ఆధ్వర్యంలో బృందానికి మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నిర్వాసితుల పోరాటానికి సంఘీభావంగా తాము మజ్జిగ పంపిణీ చేశామని వారు తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు సంఘీభావంగా జనకవనం

ఏలూరు అర్బన్:పోలవరం నిర్వాసితులకు కవులు, రచయితలు, కళాకారులు అండగా నిలబడి వారి సమస్యలను కవితలు, పాటల ద్వారా ప్రభుత్వాలకు వినిపించాలని సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరంజన్ అన్నారు. సాహితీ స్రవంతి, జిల్లా రచయితల సంఘం సంయుక్తంగా పోలవరం నిర్వాసితులకు సంఘీభావంగా జనకవనం (జనం కోసం సాహిత్యం) కార్యక్రమాన్ని స్థానిక సిఐటియు కార్యాలయంలో సాహితీవేత్త డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరంజన్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పక్షాన కవులు, కళాకారులు నిలబడి వారికి మద్దతుగా కవితలు, పాటలు వినిపించడం అభినందనీయమన్నారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి నాగాస్త్ర మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ఒకపక్క అభివృద్ధి జరుగుతుందన్న విషయం ఎంత నిజమో మరో పక్క గిరిజనుల సంస్కృతి, నాగరికత, అస్థిత్వం నాశనమవుతున్నాయన్నదీ అంతే నిజమన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.రామాంజనేయులు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు కవులు, కళాకారులు అండగా నిలబడేందుకు, వారికి న్యాయం జరిగే వరకూ సాహితీ స్రవంతి, జిల్లా రచయితల సంఘం తమ గళాన్ని, కలాన్ని ఉపయోగిస్తాయన్నారు. గ్రంథాలయ సంఘం రాష్ట్ర కార్యదర్శి లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ వారి ప్రభుత్వం నుంచి నేటి వరకూ గిరిజనులు, విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటుతనంలో ఉంటూ నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మోహనరావు, ఆనందనాయుడు, షేక్ ముస్తఫాఅలీ, గుడిపాటి నరసింహారావు, నారాయణ, శ్రీహరికోటి పాల్గొన్నారు.

'పోలవరం పోరుకేక' సంఘీభావ నిధికి విరాళాల సేకరణ

ఏలూరు అర్బన్:ఈనెల 20వ తేదీన ప్రారంభమైన పోలవరం పోరుకేక పాదయాత్ర దళానికి సంఘీభావంగా గురువారం చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా నాయకత్వం ఏలూరు నగరంలోని పత్తేబాద, మార్కావారివీధిలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వృత్తి సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గమైన వైఖరి అనుసరిస్తున్నాయని, నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టంపకారం పరిహారం, పునరావసం కల్పించాలని, అందుకు కావాల్సిన నిధులు కేంద్ర ప్రభుత్వం వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ పోరుకేక పాదయాత్ర మానవాళికి నిజమైన మేలు చేసే పాదయాత్ర అని, అందులో పాల్గొన్న ఆదివాసీ గ్రామాల ప్రజలకు, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులకు జేజేలు పలికారు. ప్రభుత్వాలు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారన్నారు. పాదయాత్ర 30వ తేదీ సాయంత్రం ఏలూరుకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాస్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు, చేతివృత్తి సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, నాయకులు వేణు, శివ, తిరుపతి పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలు కఠినంగా ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు

మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే విధంగా చట్టాలను కఠినంగా రూపొందించాలని, ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పవర్ పేటలోని ఐద్వా కార్యాలయంలో 'మహిళలపై హింస – పోరు యాత్ర' సదస్సు నాయకురాలు పి.హైమావతి, జి.శారద అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమాదేవి మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని, నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ జరిపి కఠినమైన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. మీడియా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, హింస అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చిత్రాలు, టీవీ సీరియళ్లను నిషేధించాలని కోరారు. కాలేజీల్లో, మహిళా పనిప్రదేశాల్లో వేధింపుల నిరోధక చట్టాలను, అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించే చర్యలు చేపట్టాలని, మండలానికి ఒక మద్యం షాపును మాత్రమే అనుమతించాలని, మహిళలకు విద్య, ఉపాధి హక్కుగా గుర్తించి అమలు చేయాలని కోరారు. నిజాన్ని నిర్భయంగా చెప్పే తులసి చంద వంటి జర్నలిస్టులపై బెదిరింపులు అన్యాయమన్నారు. ఆమెకు మహిళా సంఘం అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర వ్యాప్త మహిళా యాత్ర చేపడుతున్నామని, ఈ యాత్రలో మహిళలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు వి.వెంకటరమణ, ఉషారాణి, కె.సావిత్రి, ఆంజనేయమ్మ, వరలక్ష్మి, గంగాభవాని పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ట్రిపుల్ ఐటి కళాశాలలో జూలై రెండో తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జూనియర్ బాల బాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పిఈటి చిన్న తెలిపారు.

రైతులను సన్మానిస్తున్న సంస్థ చైర్మన్

రైతులకు తులసీ సీడ్స్ సంస్థ సత్కారం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మూడు దశాబ్దాల కాలంగా రైతన్నల నమ్మకాన్ని మూరగొన్న సంస్థ తులసీ సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. వడ్లమాను గోవర్ధన గార్డెన్ వద్ద ప్రతి పంట విత్తనోత్పత్తిలో అత్యధిక దిగుబడులు సాధించిన రైతులకు ఆయన గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసీ సీడ్స్ ద్వారా మూడు దశాబ్దాల కాలంలో ఎన్నో నూతన వంగడాలను అందించినట్లు చెప్పారు. నాణ్యమైన పత్తి విత్తనాలను రైతులకు అందించడంతో పాటు ఎక్కడ సాగు చేసినా రైతు శ్రేయస్సు కోసం పాటు పడినట్లు తెలిపారు. రైతుల శ్రేయస్సే తులసీ సీడ్స్ ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తులసీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్‌చంద్ర, ఆగిరిపల్లి ఉపసర్పంచ్ అనంతనేని రాంబాబు, మండవల్లి శంకరరావు, రంగరాజు ప్రసాద్, చిన్న శ్రీనివాస్, ఏటుకూరు మాజీ సర్పంచి ఉగ్గిరాల సీతారామయ్య, తులసీ సీడ్స్ ప్రొడక్షన్ మేనేజర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా జాతీయ రహదారి రోడ్డు భద్రతా వారోత్సవాలు ఉంగుటూరు టోల్ ప్లాజా అధికారులు ఈ నెల 26 నుంచి నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వాహనదారులకు, హైవే టోల్ సిబ్బందికి, ప్రయాణికులకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఈ నెల 30న నిర్వహించనున్నారు. ఏలూరుకు చెందిన శంకర నేత్రాలయం వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పరీక్షలు చేసి అవసరమైనవారికి శస్త్రచికిత్సలు చేయించనున్నారని నిర్వాహకులు తెలిపారు.

జంగంగూడెంలో కాల్‌మనీ కలకలం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని జంగం గూడెం గ్రామంలో కాల్‌మనీ కోరలు చాచింది. గ్రామానికి చెందిన కోటపాటి సుబ్బారావు, ఆయన కుమారుడు ప్రతాప్ వ్యవసాయ పెట్టుబడులకు అవుటుపల్లి గ్రామానికి చెందిన ఫైనాన్సర్ బత్తిన రాజేష్ వద్ద చేరో రూ.లక్ష అప్పుగా తీసుకున్నట్లు సుబ్బారావు భార్య మంగమ్మ తెలిపింది. అయితే ఇప్పటివరకు రూ.80 వేలు చెల్లించామని, అయినప్పటికీ చేరో రూ.లక్ష మొత్తం రూ.రెండు లక్షలు కట్టి తీరాలని కులం పేరుతో దూషించి దాడి చేశారని సుబ్బారావు కుటుంబసభ్యులు వాపోతున్నారు. తమకు పోలీసులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నూజివీడులో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాల్లో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని, గత వారంలో సుమారు 37 మంది బాధితులు స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఇంజక్షన్ తీసుకుంటున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్ర సింగ్ తెలిపారు. కుక్కలను అదుపు చేయాలని నూజివీడు ప్రజానీకం ప్రభుత్వ వర్గాలకు దీర్ఘకాలంగా విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

ఇకెవైసి నమోదు నేటితో ఆఖరు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఇ కెవైసి నమోదు కార్యక్రమం ఈ నెల 30వ తేదీతో ముగుస్తుందని, మండలంలోని రైతుభరోసా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవా కేంద్రాల వద్దకు వెళ్లి నేరుగా ఇ కెవైసి చేయించుకోవచ్చని ఎంపిడిఒ విజయబాబు తెలిపారు. వేలిముద్రలు పడని రైతులు ముఖ ఆధారిత ఇ కెవైసి చేయించుకునేందుకు కేంద్రం అవకాశం కల్పించిందన్నారు. రైతులు లబ్ధి పొందాలంటే ఇకెవైసి తప్పనిసరని, ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతులు కూడా తప్పనిసరిగా ఇ కెవైసి చేయించుకోవాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు :సూరప్పగూడెం 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని భీమడోలు జంక్షన్ నుంచి విద్యుత్ ఉపకేంద్రం వరకు నూతన 33 కెవి లైన్ల నిర్మాణ పనులను ఈ నెల 30వ తేదీన చేపట్టమన్నామని ట్రాన్స్ కో ఏలూరు డివిజన్ (ఆపరేషన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ తెలిపారు. ఈ నేపథ్యంలో సూరప్పగూడెం, ఆగడాలలంక, విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని భీమడోలు, పోలసానిపల్లి, గుండుగొలను, లక్ష్మీపురం, కోరుకొల్లు, రత్నాపురం, వడ్డిగూడెం, భోగాపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేరాలు – ఘోరాలు

విద్యుదాఘాతంతో హెల్పర్ మృతి

చింతలపూడి :లైన్‌మెన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి మండలం చింతకాయలకొత్తగూడెం గ్రామానికి చెందిన జుజ్జువరపు రంగా (40) లైన్‌మెన్ వద్ద హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం యర్రగుంటపల్లి ఊటసముద్రం ఫీడర్ మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో యర్రగుంటపల్లి ఎల్‌సి తీసుకోబోయి, ఊటసముద్రం ఎల్‌సి తీసుకోవటంతో జుజ్జువరపు రంగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై విద్యుత్ శాఖ ఎడి రాంబాబునాయక్‌ను వివరణ కోరగా ఈ సంఘటనపై విచారణకు ఉన్నతాధికారులకు తెలియజేశామని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మళ్లీ తెరపైకి చెరువు తవ్వకం రగడ

తవ్వకం పనులను అడ్డుకున్న కానుకొల్లు గ్రామస్తులు

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు

కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని వాపోతున్న దళితులు

గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - మండవల్లి

కానుకొల్లు కాలనీ చెరువు తవ్వకం మరోసారి వివాదాస్పదమైంది. గ్రామానికి ఆనుకుని చేపట్టిన రొయ్యల చెరువుల తవ్వకాలను దళితులు అడ్డుకున్నారు. గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురి చేసే విధంగా చేపట్టిన రొయ్యల చెరువు తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ గురువారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కానుకొల్లు కాలనీ వెనుక చెరువు తవ్వితే మంచినీటి వనరులు పాడైపోతాయని, తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని, దళితులు సంవత్సరాల నుంచి చెరువుల తవ్వకాలను అడ్డుకుంటూ పోరాటం చేస్తూనే ఉన్నారని గ్రామస్తులు చెప్పారు. గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు సత్యనారాయణ ఆ భూమిపై కన్నేసి ఆ భూమిని తక్కువ ధరకు కొనుగోలు చేశాడన్నారు. ఆ పొలాన్ని రొయ్యల చెరువుగా మార్చేందుకు ప్రయత్నిస్తుండగా దళితులు అడ్డుకున్నారన్నారు. తాగునీటి వనరులు పాడైపోయేలా చెరువుల తవ్వకాలు చేయొద్దంటూ దళితులు ఆయనను వేడుకున్నారు. వినకపోవడంతో గ్రామంలో విఆర్‌ఒ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరారు. దీంతో చెరువు తవ్వకాలను నిలిపివేశారన్నారు. బుధవారం సాయంత్రం చెరువు తవ్వేవిధంగా పొలంలోని నీటిని బయటకు తోడుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఆయన కులం పేరుతో తిట్టారని, ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు చెప్పారు. ఇదిలా ఉంటే గురువారం ఉదయం పొక్లెయిన్‌తో రొయ్యల చెరువు తవ్వుతుండగా అడ్డుకున్న తమపై తన అనుచరులతో దౌర్జన్యానికి దిగాడని దళితులు వాపోయారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చెరువు తవ్వకాలను అడ్డుకుంటే కేసులు పెడతామని ఇక్కడ నుండి వెళ్లిపోవాలని బెదిరింపులకు పాల్పడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సంఘటన స్థలం వద్ద పోలీసులు

గతంలో కూడా ఇదే పొలాన్ని చెరువు తవ్వకాలు చేయొద్దంటూ దళితులు ఆందోళన చేపట్టగా సత్యనారాయణ తమకులం డగా నిలిచి చెరువుల తవ్వకాన్ని అడ్డుకున్నారన్నారు. ఆ కృతజ్ఞతతోనే ఆయన వెంటే ఉంటూ ఆయన చెప్పిన వ్యక్తులకు ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించామని వివరిస్తున్నారు. ఇప్పుడు ఆయన చెరువు తవ్వకం చేయొద్దన్న పొలాన్ని కొనుగోలు చేసి రొయ్యల చెరువు తవ్వాల్సిందేనంటూ మొండి పట్టు పట్టి తమను ఇబ్బందులకు గురి చేయడం పోలీసులతో కేసులు బనాయిస్తామని బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ అధికారి తమ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని, దళితుల సమస్యలను పరిష్కరించడంలో వారికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అనేది తేటతెల్లం చేస్తుందని వారు విమర్శిస్తున్నారు. తమకు దిక్కెవరంటూ దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి తాగునీరు అందించేలా చెరువుల తవ్వకాలను నిలుపుదల చేసి ఆదుకోవాలని దళితులు ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా రెండు ఎకరాలకు అనుమతులు ఉన్నట్లు తెలిసిందని పూర్తిస్థాయిలో సమాచారం తెలుసుకుని వివరిస్తామని చెప్పారు. ఎస్‌ఐ రామకృష్ణను వివరణ కోరగా పొలాన్ని చెరువుగా మార్చుకుంటుంటే దళితులు అడ్డుపడుతున్నారని ఫిర్యాదు రావడంతో సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడామని చెప్పారు. సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించామని తెలిపారు.

కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు

ప్రజాశక్తి - నిడమర్రు

ప్రభుత్వం సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి రూ.30 వేలు అందించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ భువనపల్లిలో భవన నిర్మాణ కార్మికుడు మీరియ నాగు బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడన్నారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.30 వేలు అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు నిలిపివేయడం వల్ల కార్మికులు నష్టపోతున్నారని, ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.ఐదు లక్షలు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారురు. సంక్షేమ బోర్డులో కార్మికుల డబ్బులు ఉన్నప్పటికీ ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోసూరి శివ, నాగేశ్వరరావు, రోగుల ఏసిరెడ్డి, కమిలి నాని, సంకు సురేష్, పట్నాల రామకృష్ణ పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరంలోని 50 డివిజన్లలో ఎనిమిది టీములు, 22 క్లస్టర్ల 1300 ఇళ్లను సందర్శించనున్నట్లు నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులందరికీ 11 రకాల సర్వీసుల్లో సర్టిఫికెట్లు అందించడానికి కబాడీగూడెం సచివాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రాసెస్ పనులను నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు గురువారం ఉదయం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ మూడు రోజులు కమిషనర్, నోడల్ ఆఫీసర్ డిప్యూటీ కమిషనర్ ఎం.రాధా, సచివాలయ సెక్రటరీలు, వాలంటీర్లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కలిసి 900 ఇల్లు తిరిగామన్నారు. 446 మంది వివిధ రకాల సేవలు కావాలని అడిగారన్నారు. 316 టోకెన్లు రేజ్ చేసినట్లు తెలిపారు. 56 మంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. మరో నాలుగు రోజులు మిగిలిన ఇళ్లకు తిరిగి కావాల్సిన అవసరాలను తెలుసుకొని టోకెన్ రేజ్ చేయనున్నట్లు తెలిపారు. ఎంఎల్‌ఎ ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఆన్‌లైన్ చేసినవారందరికీ నాలుగో తేదీన సచివాలయ ప్రాంగణంలో నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అధికారులందరీ సమక్షంలో పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్, ఎన్.రాధా, సచివాలయ అడ్మిన్, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు : జూలై ఒకటో తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉంగుటూరు మండలంలో సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణకు మండల అధికారులతో రెండు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు తెలిపారు టీం–1లో తహశీల్దార్ ఎవి.రమణరావు, ఇఒపిఆర్‌డి షేక్ శంషుద్దీన్, టీం–2లో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జూలై ఒకటో తేదీన గోపీనాథపట్నం, 3న వెల్లమిల్లి–1, వెల్లమిల్లి–2, 5న బాదంపూడి, ఉప్పాకపాడు, 7న కాకర్లమూడి, బొమ్మిడి, 10న కాగుపాడు, రావులపర్రు, 12న నీలాద్రిపురం, నాచుగుంట, 14న నారాయణపురం–1,2 సచివాలయాలు, 17న చేబ్రోలు 1,2 సచివాయాల్లో, 19న కైకరం 1,2 సచివాయాలు, 21న ఉంగుటూరు–1, ఎ.గోకవరం, 24న ఉంగుటూరు–2, తల్లాపురం, 26న రాచూరు, గొల్లగూడెం, 28న గోపాలపురం, యర్రమిల్లిపాడు గ్రామ సభల్లో అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. టీం–1 అధికారులకు గోపీనాథపట్నం, వెల్లమిల్లి–1, బాదంపూడి, కాకర్లమూడి, కాగుపాడు, నీలాద్రిపురం, నారాయణపురం–1, చేబ్రోలు–1, కైకరం–1 ఉంగుటూరు, రాచూరు, గోపాలపురం గ్రామ సభలకు తహశీల్దార్, ఇఒపిఆర్‌డి బాధ్యత వహించనున్నారు.

చాట్రాయి :జగనన్న సురక్ష కార్యక్రమం చాట్రాయిలో గురువారం నిర్వహించారు. సర్పంచి దామెర ఉషాప్రసాద్‌బాబు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను వాలంటీర్లు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు సంకు శివకుమారి, వైసిపి నాయకులు సత్యనారాయణ, సర్పంచి చుండూరి ఆదియ్య, ఇఒపిఆర్‌డి నాగరాజు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం'

ప్రజాశక్తి - ముసునూరు

పంచాయతీల్లో కనీసం తాగునీరు, రహదారులను ఏర్పాటు చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని నూజివీడు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. గురువారం మండలంలోని రమణక్కపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ రమణక్కపేటలో కనీసం తాగునీరు కూడా అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, మండల అధ్యక్షులు దేవినేని బలరాం, కందుల పిచ్చియ్య, రంగు ఆంజనేయులు, రంగు వాసు పాల్గొన్నారు.

తాగునీరు.. డ్రెయినేజీపాలు..!

మండవల్లిలో పైపులైన్లకు లీకులు

వృధాగా పోతున్న వైనం

కుళాయిల నుంచి మురుగునీరు

పట్టించుకోని అధికారులు

పైపు లీకై రోడ్డుపైకి చేరుతున్న తాగునీరు

ప్రజాశక్తి - మండవల్లి

సర్పంచి అవగాహన లోపం, కార్యదర్శి నిర్లక్ష్యం గ్రామస్తులను తాగునీటి కష్టాలపాలు చేస్తుంది. పంచాయతీలో కాంట్రాక్ట్ పనులు నిర్వహించుకుని సొమ్ము చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామస్తులు రోజుల తరబడి తాగునీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి నిదర్శనమే నెలల తరబడి డ్రెయినేజీ పాలవుతున్న తాగునీరు.

మండల కేంద్రమైన మండవల్లిలోని సుమారు 3600 జనాభాకు దాహార్తిని తీర్చే విధంగా సుమారు 12 ఎకరాల్లో రెండు మంచినీటి చెరువులకు సంబంధించిన రెండు రక్షిత తాగునీటి పథకాలు ఉన్నాయి. వాటి ద్వారా సరఫరా అవుతున్న తాగునీటితో మండవల్లిలోని ప్రజల దాహార్తిని తీర్చుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించడానికి రంగం సిద్ధమైంది. డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో ఇబ్బందులు తలెత్తినా చూసీచూడనట్లు ఉంటూ సహకరించాలని ముందుగానే కాంట్రాక్టర్ సర్పంచితో, కార్యదర్శితో మాట్లాడి కొంత పైకం ముట్ట చెప్పినట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టడంతో పైపులు ధ్వంసం అయిపోయాయి. దీంతో తాగునీరు జాతీయ రహదారి డ్రెయినేజీ పాలైపోగా తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కుళాయిల పైపులైన్లు ధ్వంసమై తాగునీరు నిత్యం డ్రెయినేజీ పాలైపోతున్నా నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో స్టేషన్ రోడ్డు అగ్రహారానికి తాగు నీరందక నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీరు వృధాగా పోతుందని, తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సచివాలయాల్లో, గ్రామసభల్లో, పంచాయతీ సర్పంచి, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాగునీటిని కొనుగోలు చేసుకుని దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు వివరిస్తున్నారు. సర్పంచికి చెందిన వ్యక్తి పంచాయతీలో కాంట్రాక్ట్ పనులు చేస్తూ సొమ్ము చేసుకుంటూ కార్యదర్శి పర్సంటేజీలు తీసుకుంటూ గ్రామాభివృద్ధిని గాలికి వదిలేశారని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీంతో గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త అంతర్గత రహదారులపై ఉంటుందని, డ్రెయినేజీ పొంగి పొర్లుతూ దుర్వాసన వెదజల్లుతూ పంచాయతీ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుందని ప్రజల విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండవల్లి పంచాయతీలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి చర్యలు తీసుకొని మండల కేంద్రమైన మండవల్లిని అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఇఒపిఆర్‌డి ఆనంద్‌బాబును వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కారం చేస్తామని తెలిపారు.

పైకి పొంగుతున్న నీరు

తాగునీరు వృధాగా పోతుంది

ఎం.సత్యనారాయణ, గ్రామస్తుడు

సుమారు నాలుగు నెలల నుంచి పైపులు ధ్వంసమై నీరు వృధాగా పోతుంది. ప్రధాన సెంటర్ కృష్ణుడు ఆలయ ప్రాంతంలోనే సుమారు ఐదు చోట్ల లీకులు ఉన్నాయి. దీంతో ప్రతిరోజు తాగునీరు వృధాగా పోతూనే ఉంది. ఈ విషయాన్ని కార్యదర్శి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. స్పందనలో ఫిర్యాదు చేయగా కార్యదర్శి రెండు రోజుల్లో సరిచేస్తామని చెప్పారు. నేటికి 15 రోజులు గడుస్తున్నా ఆ మేరకు చర్యలు తీసుకోలేదు.

కుళాయిల ద్వారా మురుగు నీరు వస్తుంది

చందాన నర్సమ్మ, గ్రామస్తురాలు

పంచాయతీ కుళాయిల ద్వారా దుర్వాసన వెదజల్లే మురుగునీరు వస్తుంది. అప్పుడప్పుడు పురుగులు కూడా వస్తున్నాయి. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. తాగునీటి కోసం పిల్లలతో నానా అవస్థలు పడుతున్నాం. గ్రామ సభల్లో అర్జీలు కూడా ఇచ్చాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. తాగునీటి కోసం నెలకు రూ.600 ఖర్చవుతుంది. అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలి.

ఘనంగా బక్రీద్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో గురువారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లీం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గురజ, ముదినేపల్లి, పెయ్యేరు, సంకర్షణపురం గ్రామాల్లోని మసీదుల్లోకి ఉదయం 7–30 గంటల సమయంలో ముస్లీం సోదరులు పెద్ద సంఖ్యలో చేరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భీమడోలు : ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని ముస్లింలకు భీమడోలు మహమ్మదీయ మసీదు కమిటీ ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ మైనార్టీ సెల్ నాయకులు షేక్ హసేన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి, సోదర భావానికి, పరస్పర సహకారానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ ఆశయాలు అందరికీ ఆచరణీయమన్నారు. అనంతరం భీమడోలు మసీదులో ఇమామ్ షేక్‌దిల్షాద్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారిని కులమతాలకతీతంగా పలువురు అభినందించారు. అనంతరం షేక్ హసేన ఆధ్వర్యంలో మసీదు కమిటీ సమావేశమై మసీదుకు చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

కైకలూరు : బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం ఈద్గా నమాజ్‌కు పెద్ద మసీదు, చిన్న మసీదు నుంచి ముస్లిం సోదరులు ర్యాలీగా చేరుకున్నారు. వీరి ర్యాలీలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, లావేటి వీరశివాజి పాల్గొని శుభాకాంక్షలు చెప్పారు.

నూజివీడు రూరల్ : బక్రీద్ పండుగ సందర్భంగా నూజివీడు పట్టణంలోని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని మైలవరం రోడ్డులో ఈద్గా మైదానం, హనుమాన్ జంక్షన్ రోడ్డులోని చిన్న మసీదు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న మసీదు, కోనేరుపేట మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు షేక్ ఆలీ, షేక్ గబ్బర్, షేక్ రఫీ, సయ్యద్ రషీద్ మాట్లాడుతూ బక్రీదు పండుగ దానధర్మాలకు ప్రతీతగా నిలుస్తుందని చెప్పారు.

టి.నరసాపురం :ఏపిగుంట, బొర్రంపాలెం, అప్పలరాజు గూడెం, మక్కినవారిగూడెం, తెడ్లం గ్రామాల్లోని మసీదుల్లో బక్రీద్‌ను ముస్లిం సోదరులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ముస్లిం మత పెద్దలు సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్ అబ్బాస్, షరీఫ్, సింగరేణి కార్మిక నాయకులు సయ్యద్ నాసర్ పాషా, ముస్లిం సోదరులు షమ్మీకపూర్, సయ్యద్ ఉస్మాన్ అలీ, అమాను, అబ్దుల్లా, షేక్ బాజీ, షేక్ సయ్యద్, అన్వర్, షేక్ ఖాదర్, కరిముల్లా పాల్గొన్నారు.

కలిదిండి: స్థానిక బస్టాండ్ సమీపంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్ద మసీదు, చిన్న మసీదు, మిలటరీ పేట మసీదుల్లో వేడుకలు నిర్వహించారు.

ఘనంగా ఏకలవ్యుని జయంతి

కలిదిండి : ఏకలవ్యుని జయంతిని ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలాభిషేకం చేశారు. ఎరుకుల సమస్యల పరిష్కారం కోసం సంఘ సభ్యులు సంఘటితం కావాలని ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంబా నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రియ కుమార్, ఎంపిపి చందన ఉమా మహేశ్వరరావు, కలిదిండి, పడమటిపాలెం, గుర్వా యిపాలెం సర్పంచులు మసిముక్కు మారుతీ ప్రసన్న, సానా మీనా సరస్వతి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భోగేశ్వరరావుకు ఎంఎల్‌సి పరామర్శ

కలిదిండి :పెదలంక టిడిపి సీనియర్ నేత ముద్దం భోగేశ్వరరావు తండ్రి నాగేశ్వరరావు(85) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భౌతికాయాన్ని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ గురువారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు రద్దు చేయాలి

చాట్రాయి : చిన్నంపేట ఎస్‌సి కాలనీలో గురువారం విద్యుత్ సిబ్బంది వచ్చి పాత బకాయిలు కడితేనే తమ విద్యుత్ కనెక్షన్ ఉంటుందని లేకపోతే కట్ చేస్తామని చెప్పడంతో వినియోగదారులు ఉలిక్కిపడ్డారు. వ్యవసాయ పనుల్లేక కుటుంబాన్ని పోషణ భారమై, పిల్లలను స్కూళ్లల్లో చేర్చలేక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎస్‌సి పేటలకు వచ్చి విద్యుత్ సిబ్బంది డిమాండ్ చేయడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొమ్ము ఆనందం ఆగ్రహం వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్ల నుంచి విద్యుత్ వినియోగించుకుంటున్నారని, గ్రామంలో 127 సర్వీసులు వారు రూ.9లక్షల78 వేల బకాయి ఉందని చెప్పటం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని పాత బకాయిల రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, కాళ్ళ మండలం, జువ్వలపాలెం గ్రామం, డోర్ నెం. 2–19 గల శీలం శ్రీకాంత్, S/o. శీలం ఇమ్మానుయేలు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. **K9093841** గల పాస్‌పోర్టు ది. 18–2–2023వ తేదీన నాయొక్క పాస్‌పోర్టు రెన్యువల్ దరఖాస్తు చేసుకొను నిమిత్తము జువ్వలపాలెం నుండి కాళ్ళ మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు జారి పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది చిరునామాకు అందించగలరు.

శీలం శ్రీకాంత్
డోర్ నెం. 2-19, జువ్వలపాలెం
కాళ్ళ మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 8121846844